ఆమె వ్యభిచారిణా?

శ్రీమానాపురం అప్పారావు పట్నాయక్,

మూల్యం:
ఎనిమిదణాలు

శ్రీనివాసా ప్రెస్,
రాజమండ్రి.

పబ్లిషరు;
కందుల గోవిందం
జనరల్ బుక్ డిపో, రాజమండ్రి.

ప్రథమముద్రణ
ప్రతులు 1000 లు.

ఇ. జి. నం ౯౪.
సం .946.

1

'చంద్రా! నన్ను క్రొత్తవానిలా చూచి బెదురుతూన్నావా?'

"నిన్ను కలుసుకొనకూడదని మాఅమ్మ హెచ్చరించింది"

"ఏం చంద్రా! క్రొత్తవాడినా నేను!"

"క్రొత్తవాడివై వచ్చావు పట్నంనుంచి- పట్నంలో పెరగిన మనుష్యులు అక్కడి మోహాలకు, అబద్ధాలకు అలవాటుపడి; తిను పల్లె తిరిగివచ్చినప్పుడు పట్నంలోని వింతలు విచిత్రంగా చెప్పి కదలించి కన్యలను వశపరచుకొంటారని—

"చంద్రా! నేను ఎదిగి చిన్ననాటినుంచి ప్రేమింపబడుతూండే కన్యవు నీవే. ఏ మోసం చేసినా, అసత్యమాడినా నిను వరనేరదా"!

"నీవు పట్నం వెళ్ళి చెడిపోయావని యిక్కడ అందరూ చెప్పుకొనేవారు. నేను ఎందుకో మనసులో బాధపడేదానను. నిన్ను చెడు మార్గంనుంచి రక్షించవలసినదిగా మనసులో కోరేదానను భగవంతుని-

"అక్కడి స్నేహితుల మాటలునమ్మి మోసపోయి డబ్బును వారి ఆనందంకోసం ఖర్చుచేసేవాడను. వారిబలవంతం మీదనే బడి కూడమాని ఆటల వ్యామోహంలో కాలం గడిపేవాడను—"

"మీనాన్న పంపుడబ్బు చదువునకు వినియోగించుకొనలేదా!

"లేదు చంద్రా! మన పల్లెలోని నిష్కల్మష స్నేహాలు కావు అక్కడవి. అక్కడ అంతా స్వార్థపరులు. స్తోత్రపాఠములు చదువడం చక్కగా నేర్చిన మేధావులు. వారిబలవంతంలోనే అమాయకంగా చరించి మానాన్న పంపే ధనాన్ని నిజంగా దుర్వినియోగమే చేసుకొన్నాను. అందుచేతనే చదువుకు స్వస్తిచెప్పి తిరిగి వచ్చివేశాను—"

"ఇహా వెళ్ళవక్కరలేదా ఆనంద్!—"

'వెళ్ళను. నానిశ్చయాన్ని మానాన్నగారికి నారాకతోనే విని పించాను. నాచదువునుగూర్చి చెదుగా వింటుండే మానాన్నకు నాకోరికె ఆశ్చర్యమనిపించక అంగీకరించారు."

మున్సబుగారి కొడుకు పట్నంలో పాడుఅయినాడని అందరూ అంటే నామనను ఎట్లానోమారేది. అసలు నీదృష్టిలో నేను జ్ఞాపకం ఉంటానా అనిపించేది—"

"చంద్రా! నీకంటే నాకీ ప్రపంచంలో ప్రియతమమైనదిలేదు. మొన్న మాబడిసెలవులలోకూడ నేను నీకోసమేగా వచ్చింది! నీవు అప్పట్లోనే తాతగారి యింటికివెళ్లినావని విని ఈఊరులో ఉండ నిష్టములేక పట్నంపోయాను—

"అవును. నన్నుగూర్చి మాయింటికివచ్చి పదేమారులు అడిగావనికూడ విన్నాను. అందుకే మాఅమ్మయిప్పుడు నన్ను మరీ పెచ్చరించి మాయింటినుంచి కదలకుండా అవుతోంది.

"అవును. నేను ఈఊరువచ్చిన మొదటిరోజున మీయింటికి నిన్ను కలుసుకొన వచ్చాను. అప్పుడు మీఅమ్మనావల్ల అనూయను కనబరుస్తూ నీవు యింటలేవని చెప్పింది. నేను తిరిగి ఏదో అడగబోతూండగనే నామాట వినకుండ పశువులశాలలోనికి వెళ్ళిపోయింది. నీతో నాకలయిక నీతలిదండ్రులకు యిష్టంలేదని అప్పుడు తెలుసుకొని, గారణం అరయలేక తలవంచుకొని యింటిదారిని పట్టివచ్చాను.'

'ఆనంద్! క్షమించు. నీవల్ల నాశీలం చెడుతుందేమోననే బెంగతోనే మాఅమ్మ భయపడుతూ అనూయతను చూపుతూంది. నీవు నాకొరకు చూస్తున్నావనికూడ నేను ఎరిగే నిన్ను కలుసుకొన మూడుదినములనుంచి ప్రయత్నిస్తూ నీవు ఈవేళలో యిక్కడ ఉంటావని ఎరిగి యిక్కడకు వచ్చాను."

"చంద్రా, ఎందరకు ఎట్టి అపోహలు కలిగినా నీవు మాత్రం నాయెడ్ల నమ్మకం కలిగి ఉంటావని ఆశించాను— ఆశతోనే తిరిగి వచ్చాను—"

"నీకు అక్కడ చాలమంది స్త్రీలతో సాంగత్య మేర్పడిందని కూడ విన్నాను."

'అబద్ధం చంద్రా; ఎన్ని తప్పుడు ప్రోత్సాహలు తొలికినా నేను మాత్రం ఏ స్త్రీకి లొంగలేదని గర్వంగా చెప్తున్నాను- వారి కృత్రిమ సౌందర్యములు నన్ను మోసగించలేక పోయినాయి నిన్ను నా హృదయపూర్వకంగా ప్రేమించి, స్వచ్ఛతతో నిన్ను అన్ని వేళలా చూడగలిగే ఈనా కళ్లకు అక్కడ స్త్రీల సౌందర్యములు నన్ను మోసగించి ఆకర్షించలేక పోయినాయి—

"ఆనంద్? పట్నం మాటలు బాగా నేర్చుకున్నావూ? అంత చిరు నవ్వుతో ఆమని మాటలకు సిగ్గుతో తలవంచుకొంటూ —

"చంద్రా, నిన్ను మోసం చేయు కుంటు తలంచడం నన్ను నేను మోసం చేసుకొనడమే అని నేను ఎరుగుదును నాయందు నీకిట్టి దురభి ప్రాయంకలగడం నాదురదృష్టం'

"ఊరకే తమాషాగా అన్నిమాటలకుకూడ విచారపడు తున్నావా?

"చంద్రా, నీఅనుగ్రహమే నాఅదృష్టమని అనుకుంటూన్న నాకు—"

"ఆనంద్! ఇహ నీవు పట్నం వెళ్ళకూడదని కోరుతూన్నాను నేను—"

"నీకోరికకు అంగీకరిస్తున్నాను నేను—

"ఆనంద్! నీవు నాముందు చేసిన ప్రమాణములు జ్ఞాపకంలో ఉన్నావా.—

'చంద్రా! ఎలా మరువగలుగుతాను!— నీతో గడపిన మధుర ఘట్టాలు ఎప్పటికీ నాదృష్టిపథంనుంచి తప్పుకొనలేవు. నీవుకూడ బల వరచి చెప్పడంచేతనే చదువుకొరకు పట్నం వెళ్లాను. ఆచదువులో తంత్రములు అలవడేజ్ఞానం ఉంటుంది. మనపల్లెలో ఉండే శాంతి, పరోపకారదీక్ష, సహృదయమ ప్రేమ అక్కడమచ్చుకు కూడ లేము. అందు చేతనే విసిగి తిరిగి వచ్చివేశాను."

'అవును, అలానే విన్నాను నేనుకూడా. అందుచేతనే పట్నం చూడ ఎన్నడూ బయలు దేరనే లేదు."

'వద్దు చంద్రా!— నీలాంటి స్త్రీ ఆపట్నంలో అడుగుపెట్టకూడదు. అమాయకంగా తిరిగే ఎలాంటివారినైనా చెడుగా అర్థం చేసుకొని అక్కడివారు ఎన్నివిధాలుగా ప్రవర్తించి చూస్తారు అక్కడకు నీవు వెళ్ళకూడదు."

'ఆనంద్! అక్కడకు వెళ్ళకూడదనే నేను వెళ్ళనని చెప్పాను కదా!" అంది చంద్ర అతనికి చేరువగా నడచి అతనికండ్లలోనికి చూస్తూ—

"చంద్రా!— నీకు ఈ మధ్య పెండ్లి సంబంధములు వచ్చినట్లు కూడ విన్నాను—"

'ఆతిరువాతి సంగతులు కూడ విన్నావు కదా!—"

'అవును. ఆసంబంధములు నీవు అక్కర్లేదని త్రోసివుచ్చావని కూడ విన్నాను—"

"ఆనందును కోరే ఈమనస్సు మరొకరితో వివాహానికి అంగీ కరించగలదా!—"

"చంద్రా!— నీకోరికకు అన్యాయం జరుగదు. మానాన్నగారు కూడ మనప్రణయగాథలు పూర్తిగా ఎరుగుదురని మానేస్తుడు సుంద రయ్యవల్ల విన్నాను—"

"మీనాన్నగారా మనకలయికనుగూర్చి వినడమా!"

"ఫరవాలేదు. తొందరపడకుము. మనఅన్యోన్యతను ఎరిగిన నాతండ్రి మనప్రేమకలయికలనుగూర్చివిని చాలఆనందపడ్డారట. స్త్రీ ఈవల్లెలో అవతరించిన అవతారజగన్మోహన లక్ష్మివని ఆయనే నోటారస్తుతించారట. నీముఖంలో లక్ష్మీకళతాండవిస్తాడనీ నీవివాహంతో నా అదృష్టం ఫలిస్తుందనీ, చాలబాగుపడిపోతానని పరవశంగా అనీ. నిన్నే కోడలుగా చేసుకొంటానని నేను కోరకుండానే ఆయనగారే అన్నారట—"

"ఇది నిజమా ఆనంద్!—"

"నీదగ్గిర అబద్ధమా?—ఓవేళ మానాన్న. అంగీకరించకపోయినా మనపెండ్లి ఆగదని నీకువాగ్దానం ఇచ్చానుకదా!—"

"ఆనంద్!—నీరాకకోసమే నిరీక్షిస్తూ. నీతో స్వేచ్ఛగాతిరిగి, కలసిఉండే అధికారంకోసమే ఆశిస్తూ—ఇచ్ఛగా మమకారంలో ఊగిసలాడుతూ—స్వప్నములలో నిన్నుచూస్తూ—మనసు ఆనాడే నీకు అంకితంచేసాను. ఆదరిస్తావనికూడ నేనుమెరుగుదును. అందుచేతనే—

"చందా!—నీవు నాహృదయసామ్రాజ్యలక్ష్మివి. ఈహృదయంలో మరిఏ ప్రేమకనూ చోటులేదు. నీతోనే నాజీవితం ద్రొర్లిపోవాలి, పూర్తిగా నీలోఐక్యమయిన జీవినినేను. నామీద అధికారం నీకు ఏనాడోయిచ్చాను. నీశాశనంమీదనేగా నేను పట్నం చదువుకు పోయాను!—"

"చదువుకొని రావలసినదిగా కోరానుగాని, చెడిపోయి రావలసినదిగా కోరానా నేను!—"

"నీవు నాచెంతనేఉంటే అంతమాత్రమయినా చెడేవాడినా

కాదు, నీవెడబాటును నీవే శాసించడంచేతనే ఈలాంటి మార్పుకై నా కారణమయింది—'

"ఆనేరం నానెత్తిన తోస్తున్నావా!—" అంది వారగా చిరునవ్వుతో చూస్తూ—

"భర్త దోషానికి భార్యయే కారణమౌతుంది—' అంటూ ఆమె నీరసమిటను ఆమె బుజాలచుట్టూ తిప్పి నవ్వించాడు—

ఆతడు ఆమెకు చేరువగాచేరి తాకుతూ ఆమెమొహాన్ని తన వంకకు తిప్పుకొంటూంటే చంద్రిం సమ్మోహనశక్తివంతమైన తన కండ్లచూపులను ఆతనివంకకు ప్రసరిస్తూ అతనిమీదకు ఒరిగింది.

ఆనంద్ ఆమె బుజాలను తనవేళ్ళతో దగ్గరకు లాగుకొంటూ ఆమె నున్నితమైన శరీరసౌరభ్యం మీదకు వేళ్లనడకలను సాగింపచేస్తుంటే, రహస్యస్థలాల తాకుళ్ళకు ఒళ్ళంతా ఝల్లుమంటూ ఆమె కులికింతలు పెట్టినట్టయి శరీరాన్ని దాచుకొంటూ నవ్వింది—

ఆనంద్ కూడ ఆమెనవ్వుకు స్పతికలపి దూరంగా ఆమెను చేయి పట్టుకొని జామితోటవైపు లాగుకొని పోతూంటే చంద్రిం జారిన పమిటనైన సర్దుకోనకుండా నవ్వుతూ ఆతనివెనుక పరుగెడుతూంది.

విరిపెద్దనవ్వులు తోటలోనిచెట్లను కదలిస్తున్నాయి.

ఆపరుగులో ఆతనికండ్లు వేటిమీదనిలచి ఆనందిస్తున్నాయో గుర్తించిన చంద్రిం ఆతనిని వెక్కిరించి నవ్వింది.

ఆనంద్ వెర్రిగా ఆమెను దగ్గిరకు లాగుకొన్నాడు.

కోయిల అరచింది.

చట్టున అదరుపాటున యిద్దరూ దూరమై పైకిచూచారు—

మరల అరచింది కోయిల.

చంద్రిం ఆనంద్‌లు నవ్వులతో అస్త్రాలన్ని విడచి దూరంగా నడచి పోతున్నారు.

అంటే ఆకోకిలకూడ తమను ఆక్షణంలో చూడడం సిగ్గని ంచిందికాబోలు ఆప్రేమి ప్రేమికులకు- అడ్డులేని ప్రేమలోకాని పోతున్నారు—

2

కస్తూరి వలన అంతాకలసి ఒకవేయి యిండ్లుగల పల్లెగ్రామం-

చంద్రం పుట్టి పెరిగినది ఆఊరులోనే...

చంద్రం చక్కగా పెద్ద వంశీయ సంతతికి చెందిన పిల్లలా చిన్నప్పటినుంచికూడ అగుపించేది-

ఆమె చేరదేసి నేత్రాలను చూచిన ప్రతివారూ మహాజ్యోతిష్యం తెలిసిన యతీశ్వరులుగానే అడగకుండ ఆమె అదృష్టవంతురాలని చెప్పుతూండడం మొదటినుంచీ వాడుకలోనే ఉండేది.

యిప్పుడు చంద్రం వయసుపదునెనిమిది సంవత్సరాలుంటాయి.

మొదటినుంచి పల్లెటూరి వాతావరనంలో పెరిగిన చంద్రం చాల చలాకీగా కండపుష్టితో అగుపించేది.

ఆమె యౌవన తరుణపు బిగినిచూచి ఆశగా ఆమెవంకచూడని మగతనంగల మగాడు లేడు.

ఆమెతోమాట్లాడ ప్రతివానికీ కోరిక ఉన్నా ఆమెకు అందానికి సరితూగే పెంకితనం ఉండడంచేత ఆమెను చేరడానికి వెనుకంజ వేసేవారు.

ఆమె చనువుతోకూడిన పరిచయమంతా చిన్ననాటినుంచి ఆ ఆనంద్‌తోనే—

ఆనంద్‌యే ఆమెకు తగిన ఉజ్జీ అనీ, ఆతనితోడి వివాహమే ఆతనికి తగుతుందనీ కస్తూరి వలసలో చిన్నలదగ్గర్నుంచి ముసలి ము త్తైదులు వరకు అనుకొనేవారు.

చంద్రం ఆనంద్‌ల అన్యోన్యత ఎరిగినవారి తలిదండ్రులు వారిద్దరికీ వివాహం చేయాలని మనస్సులలో అనుకొన్నా ఒకరినొకరు ఎదురుపడి అనుకొనలేదు.

ఆతరువాత ఆనంద్ పట్నం చదువుకివెళ్ళడం, అక్కడ దుర్వ్య సనాలకు చిక్కి పాడుఅయినాడని పేరురావడం జరిగినతరువాత చం ద్రం తలిదండ్రులు ఆసంబంధం పట్ల విముఖతచెంది తనకుమార్తెను మరొకవరునకు కట్టిబెట్ట నిశ్చయంలో ఉన్నారు.

బిళ్ళలులేక తిరుగగొట్టబడిన ఉత్తరాలలాగ తన్ను అడగవచ్చిన సంబంధాలు నన్నిటినీ తిరుగగొట్టేసేది చంద్రం. ఆవయసులో యిం కా పెండ్లిలేకుండ ఉండకూడదని తలిదండ్రులు హెచ్చరించినా చంద్రం వారిమాటలను పెడచెవిని పెట్టేది. ఆమె ఆనంద్‌కి చేసిన బాసలు, ఆతనిభర్తగా కోరే తనహృదయనిశ్చయం ఆమెమనస్సు యితరవరుల మీదకు లగ్నమయ్యేదికాదు—

ఆనంద్ తనను మోసంచేయడని ఆమెమనస్సు ఆమెకు గట్టిగా చెపుతూండేది.

ఆతనికోసమే ఆమెమనస్సు ఆయత్తపడుతూండేది.

ఆనంద్ పట్నంనుంచి తిరిగిరావడం ఆనాటికి మరల వారు కలు సుకొన జరగడంచేత ఆపరస్పర ప్రేమికుల ఆనందం—

వేడుకతో పరస్పర కలియకను కోరే యువతీ యువకులకు సమావేశ సందర్భమైనప్పుడు ఆతి గాఢమధురం నరాల బాధ—హృ దయవేగం రక్తంవేడిమీదే ఊహించాలి,

ఆనంద్ కస్తూరివలన మున్సబుగారి ఏకైక పుత్రుడు— చదువు సంధ్యలలో అంత నేర్పు లేకపోయినా వేషభాషలలో మాత్రం పట్నవాసం స్టూడెంట్సుకు తిసిపోడు.

పచ్చని శరీరచ్ఛాయతో- నల్లగా మెలికలు తిరిగిన శిరోజముల అందంతో చంద్రంకు అన్నివిధముల తగిన జోడీగా అగుపిస్తాడు—

మున్సబుగారికి పదిహేను ఎకరముల ఫలసాస్యం ఉంది. ఆరాబడితో ఒకరికి చేయిచాచకుండ గౌరవజీవనం సాగిస్తూన్నారు ఆఊరిలో- అంటే- మున్సబుగారు ఆఊరిలోని మోతుబరులలో లెక్కగాకపోయినా హోదాను అండగా చేసుకొని మంచిపలుకుబడితోనే కాలాన్ని దొర్లిస్తూన్నారు.

ఆతని స్వల్పరాబడితోనే కుమారుడు ఆనందుని పట్నంచదువు కొరకు పంపడం, అక్కడ సరిఅయిన పద్ధతులలో చదువుపట్టుబడక ఆనంద్ పట్నంనుంచి తిరిగివచ్చివేయడం జరిగింది.

చంద్రం తండ్రికమున్నదుడు- ఆయనపేరు రంగాప్రసాద్ కాని, ఆయనను "రంగా" అని మాత్రం పిలుస్తూంటారు ఆఊరిలో—

రంగాగారికి పదిఎకరముల పల్లంనేల ఉంది. ఆభూమి కాలువ గట్టునే ఉండడంచేత వర్షములతో నిమిత్తంలేకుండ ప్రతిసంవత్సరం మంచి పంటపండుతూంటుంది. రంగాగారే పాలేరులను పెట్టి స్వయంగా పంటలను పండించుకొనడం పరిపాటు—

చంద్రం మొగరాయుడులా చిన్ననాటినుంచి తండ్రికి తోడ్పడుతూ వ్యవసాయవ్యవహారములను ఆమెదగ్గరఉండి స్వయంగాచూచుకొనేది.

రంగాగారి ఏకైకసంతతికి మగబిడ్డ చంద్రం ఒక్కర్తె ఉండడంచేత ఆమె తలిదండ్రులకు ఆమెపట్ల అధిక అనురాగం. ఆమె

ద్దును చెల్లించడమే వారిముఖ్య ఆశయంగా పెట్టుకొని ఆమెను అతిగా రాభంగా చూచుకొనేవారు—

ఆదినం మున్సబుగారు గ్రామసావడిలో విచారణలు ముగించి హాలులో కూర్చున్నాడు. ఆనంద్ అప్పుడే చంకలోవున్న కంతో యింటిలోనికి వస్తూన్నాడు.

"ఆనంద్! యిదేనా భోజనానికి రాక! యిప్పుడు ఎంత అయిందో చూచావా?" అన్నాడు మున్సబుగారు.

"భోజనానికేగా! ఎప్పుడు వస్తేనేం! ఊళ్లేలాలా? ఉద్యోగం చేయాలా?—"

"ఐతేమాత్రం- వేళకుభోజనం చేయవద్దటరామరి!"

"అందుకేగా చేరుకొన్నాను యింటికి!"

"ఎందుకూ ఆచురచురలు! మళ్ళీ పట్నంలో డబ్బుతగలేసిచదువాలని ఉందా?"

"అక్కడి చదువు అక్కర్లేదని ముందుగనే చెప్పాను.'

"మరి?"

"అక్కడకు వెళ్ళబుద్ధి పుట్టదు. యింటిదగ్గరఉండబుద్ధీపుట్టదు. ఏమిచేయాలో అర్థంకాదు."

"అర్థంకాని దానికి మామీద చర్విమంటే ఏలా?' అన్నారు మున్సబుగారు- అంతలోనే తండ్రీకుమారుల సంవాదమును వింటూన్న యింటి యిల్లాలు రత్నమ్మగారు చిరునవ్వుతో హాలులోనికి వచ్చి—

"ఆమాత్రం గ్రహించలేరూ? వాడికి ఏదో ఒకయింటిపిల్లను చూచి పెండ్లిచేస్తే ఆబంధంతో యిహాయిల్లు కదలకుండ దానినే అంటిపెట్టుకొని ఉంటాడని నాఅభిప్రాయం. పోనీ అలాచేసివేయ కూడదూ? వయసువచ్చినవాడిని అలా నిర్బంధనలో పెట్టిఉంచితే పాపంకాదూ?" అని అంటూంటే మున్సబుగారు చిరునవ్వుతో

"నేనుమాత్రం వద్దన్నాననేట! వాడుచెప్పకపోతే నాకేం తెలుస్తుందే వాడికోడు!" అని తండ్రిఅంటూవుంటే ఆనంద్ అక్కడ నిలువకుండ తనగదివంకకు నడచిపోయాడు.

"వాడు ఏమనిచెప్పుకొంటాడు మీతో! పెళ్లాం కావాలని మీరుచెప్పుకొన్నారా మీచిన్నప్పుడు!'

"ఆనాటిరోజులే వేరు. ఇప్పుడు ఈవెధవలు కంటికినచ్చిన దానిని తామే ఏరుకొని తెచ్చుకొని కట్టపెట్టమంటారు. పెండ్లికిముందు నిన్ను నేనుచూచే కట్టుకొన్నానంటావా?'

"ఏకాలం ముద్దులు ఆకాలంలోనే జరుగాలి. వాడుకావాలనే దానినే కట్టిబెట్టకూడదూ! నిశ్చింతగా యింటిలోనే పడిఉంటాడు. అప్పటితోగాని వాడికిసంసారబాధ్యతకూడ నెత్తికి ఎక్కదు-"

"నేను కాదన్నానా? సుందరయ్యగారి కుమార్తెను కోరియిస్తామంటూన్నారు. అన్నిలాంఛనాలు జరిపి వేయినూటపదహారులు కట్నం యిస్తామంటూన్నారు- పిల్లకూడ బాగుంటుంది—'

'వాడిచెవులో వేశారా?'

"అడిగాను- ఆమాట అసలు వినుపించుకొననట్లే జవాబు చెప్పకుండానే వెళ్లిపోయాడు'

"వాడికి రంగాగారి అమ్మాయి చంద్రంను కట్టుకోవాలని ఉంది. ఆపిల్లనుచూచి ఆనందించడానికే వారిపొలాలవంకకే పోతాడు మనవాడు—'

"అవును. అదీ విన్నాను- ఆపిల్లనువాస యివ్వడానికి అంగీకరిస్తే నేను మాత్రంవద్దంటూనా? రంగా తరువాత వారిఆస్తి అంతా చంద్రానికే చెందుతుందనే కారణంచేత కట్నాలుగూడా అక్కర్లేకుండానే ఆపిల్లను కోడలుగా చేసుకొనడానికి చాలమంది అడుగుతూన్నారట—'

"అవును. డబ్బున్న సుందరపురంవారూ, మణ్యాలవారు ఇంకా చాలమంది అడిగినారట. ఆపిల్ల తలిదండ్రులు ఎందుచేతనో ఆసంబంధాలను త్రోసిబుచ్చారట"

"వాళ్ళగిరాకీ బాగుంది. పిల్లకూడ స్ఫురద్రూపి. పది ఎకరాల పల్లం ఎప్పటికైనా ఆమెకే దక్కే అవకాశంకూడ కనబడుతూంది"

"అందుకే అడగమన్నాను. వారు అంగీకరిస్తే—'

"అంతటి పెద్దసంబంధాలువస్తేనే త్రోసిబుచ్చినప్పుడు మనకు యిస్తారా ఆపిల్లని! అదిగాక మన వాడి ప్రవర్తన అప్పట్లో గుప్పుమంది ఆనాస్త్రీఅనేవాడట! ఆరంగయ్య! పనికిమాలినవానికి వారి చంద్రిం భార్యకాలేదని—

"ముసలిదాని మాట ఆయింటిలో చెల్లేదేముంది!—అతని భార్య రామయ్యమ్మగారి అంగీకారం మీదనే ఆధారపడి ఉంటుంది ఆపిల్ల వివాహం—"

"మనవాడిలో ఏం గొప్పతనం చూచి మొగ్గుతుంది ఆమె మాత్రం!—చదువా-సంధ్యా!— సేద్యమైనా చేయడం చేతరాని చవటవాజమ్మ మనవాడని వాళ్లకు తెలియదనుకొన్నావా?

"బాగుంది చాలించే!—మీరే యిలా తిట్టడం మొదలెడతే యిచ్చేవారయినా యిస్తారా పిల్లని!—"

"ఐతే—నీవే వెళ్ళి—అడిగి—లేదనిపించుకొని రా!-"

"లేదనిపించుకోవడం ఏం!—తప్పక యిస్తారు-"

"ఎందుచేత ఆధైర్యం!—"

"ఇది ఊళ్ళో సంబంధం. కుమార్తె వారి కండ్ల ఎదుటనే కాపరం చేసుకొంటుంది. వారి యింటిలోనే చంద్రిం ఉండవచ్చును. కలసి వచ్చిన సంబంధంలా ఉంటుంది. పైగా చంద్రికు మన ఆనంద్ అంటే అభిమానం యిష్టంకూడ. వీడితో పెండ్లికి ఆ పిల్లకూడ అంగీకరిస్తుంది. అడిగి చూడండి— తిరువాత వాడి అదృష్టం—"

"చంద్రీను వారు యివ్వడానికి అంగీకరిస్తే వీడు అదృష్టవంతు డన్నమాటే ఈనాడే కలిసి మాట్లాడతాను-'ఊ' అన్నారంటే వచ్చే శ్రావణమాసంలోనే వివాహం—"

'ఆ మాటలింటే మా ఆనంద్ మీ కాళ్లకు నమస్కరిస్తాడు. వాడి మనస్సంతా ఆపిల్లమీదనే ఉంది—'

'ఇదంతా కాలమహిమ!—ఊఁ- కానియ్యి!—ముహూర్తం ఏర్ప రచి రంగయ్యగారి యింటికి నేనే స్వయంగా వెళ్లివస్తాను."

3

"రంగయ్యతాతా!—"

"ఎవరు?—వీరన్న కాపా! —"

"చిత్తం. నేనేన డి—"

'ఏం!—పని మీద వచ్చావ్!—

"పనేముంది!—చూచి పోదామనే వచ్చాను-"

"ఊరకేరావు. నాకు తెలుసు- కూర్చో!- యిప్పుడు జమీం దారుగారి కొలువులోనే ఉన్నావా!-"

"ఆ! అక్కడనే పనిచేస్తూన్నాను. జమీందారుగారంటే జ్ఞాప కం వచ్చింది. యిప్పటి యువరాజుగారికి అస్తమానం మీమాటే!— మీగురించి!"-

"మనుష్యులను గురించి ఆయనకేం తెలుసు!—వింతగా మాట్లా తూన్నావే!—"

"వింత ఏముంది!—మీయింటికి అదృష్టం పట్టనుందని గ్రహిం చాను—"

"అదృష్టమా?—"

'అవును. యువరాజాగారు మంచి ధర్మప్రభువులు. ఆయన ధర్మానికి అడ్డులేదు. మొన్న ఒక బీదముసలిదానిమీద కనికరం కలిగి రహితాపురంలో ఐదు ఎకరముల పంటభూమి వ్రాసి యిచ్చి వేశారు. మొన్న ఒక బీదవాడు యాచనకు రాగా వంద రూపాయలు పారవేశాడు—"

"అంత మంచివాడా?—"

'ఏంతమాట! అసలు ఆయనముహంలోనే ఉంది. ఆలక్ష్మీకళ. ఆతని అందాన్ని చూస్తూంటే మగాళ్ళకే వ్యామోహం కలుగుతూంటుంది. పరకాంతలంటే అసలు కన్నెత్తిఅయినా చూడని సహృదయుడు—'

"సముద్రం అవతల చదువుకొళ్లి వచ్చాడంటారే ఆయన. వయసుకూడ ముప్పది సంవత్సరములకు మించిఉంటాయనే అనుకొంటారు. ఆయనను చూస్తే తండ్రిని చూడనక్కరలేదట కదూ!

'అవును. ఆయనకీవి అంతా ఆతనిలోమూ ర్తీభవించి ఉంటుంది ఖర్చుకి వెనుదీయని బల్లాదారుడు.'

'ఆయనతండ్రితో సమానవయస్కుడులాగే అగుపిస్తాడటకదా!

'అవును. ఆయింటినంరక్షణలో అలాగేఅగుపిస్తారాయన'

"వీరన్నా! నీవుఆయననుగూర్చి అంతమంచివాడని చెపుతావ్ ఊరిలో మరోలా అనుకొంటారు—"

"ఇదిగో తోకఅంటే- అదిగో పులిఅంటారు. ఆయనదగ్గరఉండి పనిచేస్తూన్న ఆయన మంచిచెడ్డలు నాకంటే పైవారికి ఎక్కువతెలుస్తా యంటారా?"

"అవును. ప్రస్తావనలో అంటూన్నాను. ఆయన ఎట్టివాడు అయితే మనకేం కావాలి!"

'అంతేలెండి, కాని- బుద్ధిపుట్టి ఒకరిమీద అభిమానం కలిగిం దంటే శరీరం కోసియిస్తారు. ఆయింటికి బంగారుగోడల్ని కట్టిసారు'

"శ్రీగుకు అలవాటు ఉండటకదూ!"

"దాతృత్వం పుచ్చుకొంటారు. ధనికులు- వారికి ఎట్టి అల వాటులున్నా దోషంలేదు—

'కావచ్చును—"

"మీ అదృష్టం పండింది. మీమీద వారికిఅనుగ్రహంకలిగింది.

'ఆయనకు మామీది అనుగ్రహమునకు కారణం?"

"యినాంగా కొన్ని ఎకరములు మీ పేరను వ్రాస్తా మంటూ న్నారు. మీపల్లంభూమిమీద విధింపబడిన అధికపన్నులను ఈ క్యాంపులోనే తగ్గించివేస్తానన్నారు. మీరువచ్చి చెప్పుకొండి రంగయ్య గారూ! నేనుకూడ ఉంటానుగా—"

"మామీద వారికి అట్టిఅనుగ్రహం కలుగడానికి కారణం?"

‹చెప్పమంటారా? మీరు మరోలా ఎంచవద్దు. నేను మీ బిడ్డలవంటివాడ్ని. నేను ఎవరితోనూ ప్రాణంపోయినా అనను. ప్రభు వులతోటిమాట. వచ్చే అదృష్టాన్ని ఈస్థితిలో ఆపకూడదు.

'అసలువిషయం చెప్పడంలేదు.'

'ఆయన పరస్త్రీలను కన్నెత్తిచూడరని చెప్పానుగా!"

'అవును. ఐతే!—"

'మొన్న చంద్రం పొలమునుంచి పశువులను తోలుకొనివ స్తూంటే యువరాజాగారు క్యాంపు గుడారంలోనుంచి చూచారట. అప్సరస కాంతలాంటి మనచంద్రం సోయగం అతనిని కవ్వించి వ్యామోహ పరచింది. ఎన్నడూ చలించని వారిమనస్సు ఈనాడు చలించింది—"

'ఐతే ఏమి చెప్పవచ్చావు వీరన్నా —

'ఆలోచించండి. ఈసంగతి ఎవరికీ తెలియదు. ఆమె భవిష్య త్తుకు అన్యాయం జరుగకుండ రహస్యంగా ఆయనతో ప్రావకం సంపా దిస్తె మీరు కుబేరులు అవుతారు. ఆయనను చూచిందంటే చంద్రం కూడవప్పుకొంటుంది. ఏదో నాలుగుడబ్బులు ముట్టెఅవకాశము వచ్చి నప్పుడు వదులుకొనగూడదు—"

'వీరన్నా! మేము సంసారులమని తెలుసునా? వాడికి బుద్ధిలేక పోతే నీబుద్ధి ఏమైంది! వారు అట్టివారు కారని ఆయనకు చెప్పవద్దా?'

"చెప్పాను. ఎంత చెప్పినా వినేపద్ధతిలో లేరు. ఒక్కమాటు చంద్రింవస్తే ఎంతసొమ్ము అయినా యిచ్చుటకు—'

'చాలు వీరన్నా! డబ్బుకొరకు యోచించి శీలం పాడుచేసుకో మని నీవుకూడ సలహాయిస్తున్నావా? మున్సబుగారి అబ్బాయితో చంద్రిం వివాహం స్థిరపడింది. వివాహం కాబోయేకన్య జీవితంపాడు చేయడం ప్రభువులకు ధర్మంకాదు—"

'ఈసంగతి మరియొకరికి తెలియకుండ జరిగిపోయే అవకాశం నేను చూపుతానుగా!"

'యిహ ఆమాటలుకట్టిబెట్టు. కూటికి పేదనైతే కులానికికాదు వంశ గౌరవం అవసరం. మాదిబోగం కులంకాదు. వెళ్లువీరన్నా— ఈమాటలతో మరల మాగుమ్మం ఎక్కకు."

'రంగయ్యగారూ! కోపించకుండా కొంచెం యోచించండి. చం ద్రింను ఆయన సులువుగా వశపరచుకొనగలగలరు. కాని—'

'ఆ! ఏమంటూన్నావ్!"

"యువరాజాగారు స్వయంగా చంద్రింను ఎదురుపడి అడిగితే ఆమె అంగీకరించి తీరుతుంది. యౌవనంలోఉన్న చంద్రిం ఆతని ఆనందానికి ముగ్ధురాలై—'

'వీరన్నా! జాగ్రత్త! మాచంద్రింను అంత తేలికగా ఎంచ వలదు—"

పెండ్లి ప్రయత్నం లేకుండానే ఆనందంతో రహస్యంగా సంభోగసుఖాలను అనుభవిస్తూన్న చంద్రం యువరాజు కోరికను తోసిపుచ్చగలదా?

"వీరన్నా! ఈనాడు మాకుటుంబ గౌరవమును పెరికివేయునిశ్చయముతో యిక్కడకువచ్చి వాదనకు దిగుతూన్నావా?"

"కాదు—ఒక్కమాటవినండి. మీబాగునుకోరి యిచ్చటకు వచ్చాను- ఈరహస్యం ఎవరికీ తెలియకుండ కాపాడుబాధ్యత నాది. ప్రమాణంచేసి చెపుతూన్నాను. ఈరహస్యం ఆమె పెండ్లికి అడ్డు రాకుండ—"

"నీచుడా! రంగా అంటే ధనాశాపరుడనే నమ్మకంతో యిక్కడకు వచ్చావా? కులస్త్రీలను చెరపచూచే పిశాచరుడవానీవు? రక్కసుడా! నాఅరుగు దిగు—" అని రంగా పౌరుషంగా బొబ్బలిలా మునలికంఠంతో గద్దిస్తూంటే—

'రంగా బాబూ! యోచించండి. ప్రభువులు తలచుకొంటే- దెబ్బలకు కొదువయుండదు. అల్లరికాకుండ రహస్యంగా జరిగిపోతే చంద్రంజీవితానికి భగ్నంరాకుండా నేను బాధ్యతవహించిచూస్తాను. లేదా— ఆమె యువరాజాగారి చేతిలోనుంచి"

'ఛీ! పశువా! యువరాజుఅని భయపడి శీలం బలిచేసుకొనే నీచులంకాదు. ఉత్తమవంశీయులం. అకారణంగా అవినీతిమార్గంలో రాజుప్రవర్తించడం అరాచకం- అన్యాయంకూడ—

'పల్లెలలో ఈపాటలు సాగిరావు. మీకుటుంబమునకు కొంత రాబడిని చూప—"

"ఛీ! దుర్మార్గుడా! నోరెత్తితివా తలపగులుతుంది-" అని మునలితనంగా గారుకర్రను తీస్తూంటే వీరన్న వినీవినిపించనట్లు నోటిలో గొణుగుకొంటూ అక్కడనుంచి నడచిపోయాడు.

రంగా కేకలు విన్న అతనిభార్య రామయమ్మ తొందరగా

వీధిలోనికి వచ్చినప్పుడే పశువులను పొలంనుంచి తోలుకొనివచ్చిన చంద్రంకూడ అరుగు ఎక్కింది.

'ఎవరిమీద ఆ కేకలు?'

"వెధవ! వెర్రికూతలు కూశాడు. తగిన బుద్ధిచెప్పి పంపాను."

"ఎవడు? ఏమన్నాడు?"

'వీరన్న వెధవ! పిల్లిలావచ్చి పులిలామాట్లాడాడు"

'ఏమన్నాడండీ!"

'అమ్మాయి విషయంలో వెధవ నీచంగా మాట్లాడాడు. ధనం ఆశచూపి తాగుబోతు యువరాజునంగతి నాతో చెప్పవచ్చాడు—'

"అంటే?"

'నాకు అర్థమైంది. రాఅమ్మా- నేనువినిపిస్తాను-' అంది చంద్రం అంతాగ్రహించినట్లు—

'ఎక్కడికి రావడం! యిక్కడవినిపించకూడదా?"

"యువరాజు నన్నుకోరుతూన్నాడని వాడే నాతో వేడుకగా వినిపించబోయాడు. నేను మొగము వాచేటట్టు చీవాట్లువేసి పంపివేశాను. తాను తెలియక అడిగినందులకు నన్నుక్షమాపణ కోరుతూ నిన్న వెళ్ళిపోయాడు. ఈదినం నాన్నతోకూడ ఆమాటలే మాటాడ వచ్చినట్లున్నాడు-"

'పీడితల అమాంతంగా భగవంతుడు నరకా! యివామాటలు వీడుపట్టుకొనివచ్చింది! ఇట్టివృత్తులుచేసే అజమీందారుల డబ్బుతో యిళ్లునింపుకొని యిండ్లుకొనుక్కొంటూన్నాడు. లేకుంటే కానీరాబడిలేని ఈ వెధవలకు ఈకొద్ది దినాలలోనే యింతఆస్తి ఎకడనుంచి వస్తుంది. అన్నారు రావమ్మగారు.

"పాపపు పనులకు చోరబడి, మానసత్వమును మరచిచరించే నీచులు ఎంతడబ్బుగడిస్తేమాత్రం ఫలితం ఏముంది? సంసారులను చెర

వచూచే దుర్మార్గులు అపావఫలితం యిహంలో నే పొంది తీరుతారు—
అన్నారు రంగాగారు, దుర్వాసునిలా శపించే కంఠధ్వనితో—

"ఆత్మవంచన చేసుకొని బ్రతికే నీతిలేని వెధవలకు యముడు కూడ జడిసే దూరంగా ఉంటాడు. అందుచేతనే అట్టివారు చిరంజీవులై ప్రపంచంలో నిలచిపోతారు—" అందిరామమ్మగారు.

'వెధవ! చచ్చునాగమ్మ! ఈమారు అరుగుఎక్కనియ్యి ప్రేడ నీళ్ళుచల్లి పంపుతాను-" అని కసురుకొంటూ రంగయ్యగారుఇంటిలోనికి నడుస్తూంటే చంద్రం రామమ్మగార్లు ఆయనను అనుసరించారు.

♦ ♦ ♦ ♦

"వీరన్నా—!'

"ప్రభూ!—"

"కాయా? పండా!'

"మొదటిమాటేనండి-"

"అంటే!"

'కాయఅన్నమాటేనండి ప్రస్తుతం-"

'అది ఎంతలో మాటవి ఆశచూపావ్ కాదో య్!"

"అనుకొన్నానండి. యౌవనబిగిలో పోతరించి ఉంది- మీవంటి అందగాళ్ళమాటచెప్పి కైపుఎక్కిస్తే ఒప్పుకొనపోతుందా అని అనుకొన్నాను—'

"ఇప్పుడు ఏమైంది. ఆమెకండ్రి ఒప్పుకొనవచ్చన్నావుగా!'

ప్రభువువారి మాటంటే కట్టుబడతారనుకొన్నాను. ఏమి ఆశ చూపినా ఆగకుండ తిట్టి పోశాడండి ఆముసలిగాడిదకొడుకు! వాడి గర్వానికి ప్రాయశ్చిత్తం జరుపకుండ మనం ఆపకూడదండి."

"ఊ! సరే—"

'ఆముసలాడు మనకాళ్ళదగ్గరకువచ్చే విధానం చూడలేరండీ బాబయ్యా!"

'అది యిప్పట్లో- తొందరలో జరుగుపనికాదు. బుద్ధిబలము ఉపయోగించి చేయాలి ఏపనిఅయినా-'

'చిత్తం. అప్పటివరకు ఆచంద్రం మనదే రాకువచ్చే అవకాశం అగుపడదు—'

"యింక ఏమీ ప్రయోజనం లేదంటావా!'

'లేదండి. ఆమున్సబుగారి కొడుకు ఆనంద్ అనే కుర్రాడితో దానిపెండ్లి స్థిరపడింది. ఆపిల్లకూడ ఆకుర్రాణ్ని కోరుతూండడంచేత ఆవివాహం వచ్చేనెలలో చేయనిశ్చయంలో ఉన్నారట.'

'ఆమెను స్వీకరించుకొను విధానం కోసమే యోచిస్తూ యున్నాను-'

"అది చాల పెంకిరకం పిల్లండి. సాధారణంగా చిక్కేరకం కాదు. అంతకంటె మంచిపిల్ల ఉందండి. మనషివయసు పొంకంమూడు మూర్తులా అలాగే ఉంటుందండి. కాని రంగుమాత్రం కొంచెము నలుపు—'

"ముహంలోకూడ అంతటి అందం ఎల్లైగ్రామంలో ఎవరికీఉండ దనే నావిశ్వాసం.'

'చిత్తం. ఆమాట నిజం. ముహంలో అంతటి కళ ఉండకపో యినా నేను చెపుతూండే పిల్లమాత్రం వయసులో మీూకునచ్చుతుంది.

'ఎవరోయ్ మరి ఒక తె!—'

'కావలిస్తే నందలడిన తరువాత తమ గుడారానికి వెంటపెట్టు కొని—''

'అసలు ఎవరు ఆమె! యిప్పుడు ఎక్కడఉంటుంది!'

'పొలానికి పోతుందండి. యిప్పుడు అగుపడదు''

"దానితలిదండ్రులు ఎవరు! అదిమాత్రం సులువుగా వస్తుం దని నమ్మకం ఏమిటి!'

దానిసంగతినాకు తెలుసండి. నామాటంటే అది కొట్టివెయ్యదు రాత్రివేళ వచ్చుటకు ఆమె తలిదండ్రులు—

అదంతా తమకు అక్కర్లేదు. నేను తెచ్చి మీముందు ఉంచు తాగా! ఆధైర్యంఉంది కాబట్టే ధీమాగా చెపుతూన్నాను. రాత్రి వేళ అది ఎక్కడకు తిరిగివచ్చినా దానిమొగుడుకూడ దానిని అడ్డు పెట్టడు. ఏదో మిషచెప్పి నేను తెస్తానుగదండీ! చంద్రం విషయంలో ప్రయత్నం రైటుకాకపోతే అన్ని కేసులలోనూ అంతేనంటారా—! వీరన్న చేతిలో—

అంత నిర్భయంగా గలిగే ఆమనిషి ఎవరోయ్! నాకు ఇప్పటి వరకు ఏల తెలుపకుండ ఉపేక్షచేశావు.

తమరు చంద్రం ఎంగిలో ఉన్నారని ఆప్రయత్నంలో ఈకేసు సంగతి చెప్ప మరచాను. అదిగాక ఈమనిషి మనం ఎప్పుడు రైటంటే అప్పుడే వచ్చేరకం కాబట్టె కొంచెం నిర్లక్ష్యంతో ఊరుకొన్నాను.

దానిభర్త వ్యవసాయదారుడేనా?'

పూర్ణయ్యగారి పొలంలో పనివాడు.'

అంటే- పాలికాపా?

చిత్తం—

వాళ్ళకులం.

అగ్రజాతివారండి.

మాల వాళ్ళా?

చిత్తం. మనకు మనిషితో నిమిత్తంగాని కులముతో ఏంపని!

వీరన్నా! నన్ను నీదృష్టిలో చులకనచేసుకొన్నావ్.

ప్రభువులు! అలా అన్నారేం.

నీచపు ముండలతో సాంగత్యమును కోరుతూన్నావని నీ తలంపా—?

లేదు ప్రభూ! సముద్రం అవతలదొరసాని అమ్మలతో పూర్వ సాంగత్యం ఉన్న తమకి కులవివక్షతతో నిమిత్తం లేదనుకొన్నానండి-

కావచ్చు. ఆదొరసానులకు వీళ్ళకూ పోలికయే ఉండదు. శుభ్ర తఎరుగని ఈమాలముండలతోనా నాకు సాంగత్యం—

ఈమాలదికూడ సంసారికమేనండి.

సంసారి మనతో ఏలవస్తుందని నమ్మతాను నేను!

అబద్ధం చెప్పను ప్రభువుల దగ్గర.

సింహం కోరిందా ఏనుగుకుంభస్థలమునే కోరుతుంది. నక్కవలె నానారకం మాంసములను కోరదని నీవుగ్రహించినప్పుడే నీవునా వద్ద ఉద్యోగమునకు అర్హుడవుకాగలవు.

చిత్తం. పొరపాటు పడ్డాను. క్షమించాలి.

చంద్రం తప్ప యితరుల మీదికి నామనస్సుపోదు. ఆమె నాకు అనుకూలపడు విధానంకోసమే మనం యోచించాలి.

చిత్తం. మీరు ఏలా ఆజ్ఞయిస్తే అలా నడచుకొంటాను.

ఆమెనుంచి నామనస్సు త్రిప్పుకోలేక పోతూన్నాను. తొందరలో ఆమెను అనుభవించు సుఖంకోసం నామనస్సు ఆతృతపడుతుంది.

బాగా యోచించాలి. అది చాల పెంకిరకంపిల్ల. చిన్న ప్రయత్నాలతో సాధ్యపడినదికాదు.

అవును. ఆమె పెంకితనమే నన్ను మరీ ఆకర్షనీయునిగా చేస్తూంది. ఆమె నావశం చేసుకొని జీవితమంతా అనుభవించాలనే తృష్ణ నన్నుబలవంత పరుస్తూంది- నాకు వివాహమే జరిగియుండకపోతే ఆ చంద్రంనే వివాహం చేసుకొనే వాడ్ని—

ప్రభువులకు ఒక సామాన్యకాంతతో వివాహమా!

"చలాకిగా — పెంకిగా చూచే ఆమెచూపు— ఆకండ్లలో మెరనే నిరంకుశత్వం- యానశోభను పరిమళింపచేసే ఆమెఉరభాగవు వంపులు నాలోఎన్నడూ కలుగని ఎరుగని ఉత్తేజాన్ని కలిగిస్తూ

బాధింపచేస్తూందంటే ఆమె సామాన్యకాంత అంటావా! స్త్రీసంఘ
గసుఖరహస్యం ఎరిగిన ప్రతిపురుషుడు ఆమె పాదాలముందు సాష్టా
ఙ్గప్రణామం ... ...

బాబూ—!

'వీరన్నా! మోహపూరితమగు నామనస్సు ఆనిమిషంనుంచి పుష్పంవంటి ఆమెకోమలమైన ముఖంనుంచి మరలలేకుండా ఉంది. మరువలేని మాయామోహినిలా నన్ను కట్టుగొన కలిగింది."

ప్రభువులు యోచించాలి. త్వరలోనే కోరినవరుని వివాహం చేసుకొనబోతూన్న చంద్రిం మీతో పరిచయానికి అంగీకరిస్తుంగని నాకు తోచదు. బలవంతంమీాదగాని పనిజరుగనట్లు నాకుతోస్తూంది."

'బలవంతంవల్ల అల్లరికాగలదు. అంతకంటె మంచిమార్గములు అనేకం ఉన్నాయి—' అన్నాడు జమీాందారీ విశ్వాసరావు.

"మంచిమార్గములా?"

"అవును వీరన్న! చూస్తావుగా—

'చెప్పండి బాబయ్యా— ఆమంత్రం, నేనుకూడ ఆమంత్రా గ్నిపటించి ఆంజనేయుడు సంజీవీపర్వతం తెచ్చినట్టుచంద్రింనుఎత్తుకొని వచ్చి మీాముందు ఉంచుతాను—'

"అదికాదులే విధానం- మాయోపాయమే ఈపరిస్థితులలో అవసరం—"

"రావణాబ్రహ్మలాగన్న మాట!"

"అవును. ఎంతటి పతివ్రతనైనా మనం తలచుకొంటేపట్టి యిచ్చుటకు రప్పించే యుక్తినాకు తెలును!"

"వినిపించి నాకుసంతసం కలుగచేయకూడదా ప్రభువులు!"

"నీనంతనం నాకు అవసరంలేదు. చూడువీరన్నా— ఆచంద్రిం సాయంత్రిం చీకటిపడబోవు ముందు పొలంలో ఉంటుందా!"

"ఊహూ- సందలడే వేళకు యింటికిచేరుకొన పొలంనుంచి బయలుదేరి పోతుందండి—'

"అదే! ఆవేళలో పొలంనుంచి యింటికి తిరిగివస్తుందిగదా!

"ఆ! తమ యింటి పశువులను తోలుకొని యింటికి విధిగా వస్తుంది.'

"మంచిది! ఆమెపొలంనుంచి రాకపోక తోవ్రలునాకు ఎరింగించాలి—'

"ప్రభువులు యిప్పుడువస్తే చూపుతానండి. తమ ఆజ్ఞకాదనగలనా!"

"నీలకంఠరావునుకూడ నేను రమ్మన్నానని యిప్పుడే తీసుకొనిరా! ఆబాటలు మనంవెళ్ళి చూచిరావచ్చును."

"రావుగారిని మనతోడనే తీసుకొని వెళ్ళుటకు పిలచుకొనిరావాలా—!"

"అవును. ఆయనకూడ ఆబాటచూడాలి."

"చిత్తం. ఆతడుచూడడం అవసరం? బలవంతంగా దారికాసి మోసుకొని రావడానికా? కండపుష్టిఅయినాలేని నీలకంఠరావుగారు ఏమిచేస్తారండీ!"

"నీలకంఠరావుతో తొందరగా రావాలి. ఈలోగా గుఱ్ఱం తీసుకొని యిప్పుడే వస్తాను—"

"చంద్రిం యిప్పుడే పట్టుకొనే ప్రయత్నమా ప్రభూ!'

"కాదు. బలవంతంమీద పట్టుకొనడం మాపద్ధతికాదు. రేపు నేను చేయబోవు మాయోపాయానికి నీలకంఠం అవసరం ఉంది—'

"ఆమాత్రంపని నేను చేయులేనంటారా? నేను చేయ్యలేనిపని నీల్లకంఠం చేయ్యగలడు అంటారా!"

నీవు ఉండనేకూడదు. ఈఉపాయంలో నీవు ఆగుపడుతే పని చెడుతుంది—'

"చిత్రం. మీరాగు ఎక్కడ ఉండమంటే అక్కడనే ఉంటాను.'

4

"ఆగు- చంద్రం—'

"ఎవరునీవు? ఎవరితో మాటలాడుతున్నావ్!'

చంద్రం- అని పిలచేగా ఆగమన్నాను-

"నాపేరును సంభోషించి నన్ను ఆగమని చెప్పే నీవు ఎవరవు!

'కనిపించడంలేదా? మనుష్యుడను. అందులోను మగవాడను. మగాడు ఆడదానిని ఏకాంత సమావేశంలో ఆగమనడంలో తప్పే ముంది? సృష్టినైజంకదా?'

"అసందర్భముగా నోటవచ్చినట్లు పేలితే కొన్ని పండ్లు ఊడ గలవని చెపుతూన్నాను-"

నీవు యిప్పటివరకు ఆజామిచెట్టు నీడలో ఎవరితో మాటాడు తూన్నావో నాకు తెలుసు- ఒకకన్య వివాహానికి పూర్వ మగాడితో మాటాడవచ్చునా? ఆతనితో అంత నీవు ఆనందంగా మాటాడిన నీవు నాతో అరగడియ ఆనందంగా ఉండటానికి సంకోచం దేనికి!—'

"పెండ్లికి ముందుగనే గర్భాదానసుఖమా?-"

'ఛీ!—పశువా!—నా త్రోవకు అడ్డం నిలువకు. నీవు ఎవ రవ్!—జమీందారు చేత పంపబడిన కిరాతకుడవా నీవు? జాగ్రత్త!-"

"జమీందార్!—వాడు ఎవరు!—వానితోకూడ నీకు సంబం ధముందా? —గా కాదు వా ఉన్న మే!"—

'నోటికి వచ్చినట్లు వదరక తోవనుంచి తప్పుకో!- పశువులు ముందుకి పోతూన్నాయి—''

"వాటికి యింటి తోవ తెలుసు. నిన్ను నాకోసమే విడచి పోతూన్నాయి నీపశువులు—''

"ఏమిటిరా ఈమాటల చోరవ!—''

"చోరవకు ఏముంది!—మాటలతో వినకపోతే బలవంతం—' అంటూ ఆమె గాజులచేతిని పట్టుకోనబోయాడు—''

చంద్రం తోకతొక్కిన త్రాచులా ముందుకువచ్చి గట్టిగా అతని దొడమీద 'చళ్' న లెంపకాయ కొట్టింది.

చంద్రం అతనితో ఆఖరు నిమిషంవరకు పెనుగులాడుతూ తోటలు ప్రతిధ్వనించునట్లు ఒకటి, రెండుమారులు అరచింది. కాని-అరవకుండ ఆమె నోటిని అతడు నొక్కివేయడంలో అలసటతో గట్టిగా అరవలేకపోయింది చంద్రం—

ఆ పెనుగులాటలో అలసిన ఆమెను అతడు పశుబలంతో ఆక్రమించుకొన్నాడు.

చంద్రం మరల రక్షణకొరకు కేక లేసింది.

జమీందార్ గుర్రపుస్వారి చేసుకుంటూ చంద్రం నిర్భంధింప బడుచున్న తావుకు వచ్చి నిలబడ్డాడు.

ఎవరది!—ఆ కేకలు పెట్టింద ఎవరు!—'' అని గర్జించాడు గుఱ్ఱంమీద ఉన్న జమీందార్ విశ్వాసరావు.

భీతిగా అతనివంక చూస్తూ దూరంగా లేచి నిలువబడ్డాడు. అప్పటివరకు చంద్రంను నిర్భందిస్తూన్న ఆ పశుకాముకుడు.

చంద్రం తన చీరను సరిజేసుకొంటూ పౌరుషంగా

"చూడండి!—ఈ దుర్మార్గుడు వంటరిగా పోతూన్న నన్ను నిర్భయంగా చరబట్ట చూస్తున్నాడు. ఎంత అరచినా విడువకుండ బాధించాడు. మీరు రాకుంటే నాప్రాణమే పోయేది—" అని చెప్పు

తూంటే, ఆమె మాటలతో ఆ జమీందార్ ముఖంలో కోపమును సూచిస్తూ—

ఎవడవురా [నీవు!—వశువా!—దారివెంట పోయే స్త్రీలను బందిపోటుగా దారికాసి పశు కామముతో పట్టుకొనచూచే నీవు ఎవరవు!—" అని గర్జించాడు—

"ప్రభూ!...ఈమెను నేను మోహించాను. విరహం అణచుకొనలేక దీనిని అనుభవించే వాంఛతో—"

"నోరుమూయ్!— నీ విరహం తీరడానికి మృత్యుదేవతను కౌగలించుకో—దుర్మార్గుడా!—" అంటూ జమీందార్ తన మొలనుంచి పిస్తలును లాగి, ఆతనిని గురిచూచి 'ఢాం' మనిపించాడు.

ఆ దెబ్బతో ఆ కాముకుడు హా హా కారములతో నేలమీదకు ఒరిగి విల విల తన్నుకొంటూన్నాడు. చంద్రిం ఆశ్చర్యంగా ఆదృశ్యాన్ని చూస్తూన్నప్పుడు ఆమె ముఖంలో భీతిసూచన రేఖలు అగుపించాయి.

"ఏమిటి! హత్య!!'

అవును. నిన్ను బలవంత పరచినవానికి అట్టి శాస్తి జరగావల్సిందే'

ఈనేరం నామీదనా—!

భయపడకు. నేను యిప్పుడే తప్పించుకొని పోగలను. కాని— నీరాక ఈతోటనుంచి ఎవరైన గమనించిన నీకు ముప్పురాగలదు. జాగ్రత్త! నేను వెడుతూన్నాను.

'ఆగండి- నాకు భయంగా ఉంది. నలుదిక్కులా చీకటి అలుముకొనే ఈసమయంలో యిచ్చట నిలువలేను. తోటదాటువరకు మీరు సహాయంగా ఉండవలసినదిగా—

అదిగో పిస్తల్ షాట్ శబ్దానికి ఎవరో కొందరు ఈవంకకే పరుగెత్తుకొని వస్తూన్నారు. ఈశవం సమీపంలో నీవు ఉండకూడదు. రా! ఈగుర్రంమీద కూర్చో- రక్షించి నియింటివద్ద దిగువిడుస్తాను.'

గుర్రంమీదనా! నేనా—!"

త్వరపడాలి. యోచనకు యిహ కాలంచాలదు. నిజం తేలువరకు ప్రభుత్వం నిన్ను ముందుబంధించి తీసుకొనిపోతుంది. దీనివల్ల నీముసలి తలిదండ్రులకు బెంగకలిగించినదానవు కాగలవు—

మీరు—

మీయింటిసమీపంలోనే నిన్ను విడుస్తాను. అనుమానించకు. ఆపదసమయం త్వరపడాలి—" అని తొందరపరుస్తూ జమీందారు విశ్వానరావు ఆమెను తన గుర్రం ముందరభాగంలో కూర్చుండబెట్టుకొని గుర్రమును పరుగెత్తిస్తూంటే స్వయువరంనుంచి రాణిసయుంక్తను పృధీరాజ్ తన గుర్రంమీద కూర్చుండబెట్టుకొని తనరాజ్యమునకు గొంపోయిన దృశ్యం జ్ఞప్తికివచ్చింది.

5

జమీందార్ విశ్వానరావేనా?

అవును. దుర్మార్గుడు. మోసంచేసి తనబంగళాకు నన్ను మోసుకొనిపోయాడు—

రాత్రంతా- అచ్చటనేనా?

ఏమిచేయను? అక్కడ నన్ను రక్షించేది ఎవరు?

దుర్మార్గుడు! ఎంతటి ఘోరానికి సాహసించాడు!

త్రాగుబోతు! తుంటరి! నీచుడు—

అమ్మాయి! నిన్ను— వాడు—

ఆ! చెరచాడు. జంతువులా నన్ను ఉపయోగించుకొన్నాడు. కానీ అదిదొంగమాటలతో భయపెట్టి—

ఏమువకు తల్లీ! భగవంతుని యిష్టానికి మనము వ్యతిరేకించ లేముకదా?

కళంకినగు నన్ను ఆనంద్ అంగీకరిస్తాడా?

అమ్మాయి! ఈసంగతి వాళ్ళవరకు ఏలాపెళుతుంది! జమీందారు వారికి తెలియబరుస్తాడంటావా?

వాడు తెలియచేయనంతమాత్రింలో నాకళంకం నన్ను విడచి పోతుందా? పతితనగునాకు—

అమ్మాయి!

ఈకళంకం దాచుకొని ఆతనికి మోసాన్ని జేయలేను. నన్ను ప్రేమించి నమ్ముతూన్న ఆనంద్‌కు నేనేమోసం చేయతలవడాలా— అంటూ కళ్ళనీళ్లుపెడుతూంటే —

పిచ్చిపిల్లా! వాళ్ళకుచెప్పుకొంటే నీకళంకం తీసివేస్తారా? నీజీవితం అల్లరిపాలు చేసుకోవడంకాదా?

ఈఅగ్నిపర్వతాన్ని రహస్యంగా నామనసులో ఎంతకాలం యిముడ్చుకొని ఆయనకు మోసంచేయగలను! నన్ను విశ్వసించి వివాహమాడచూచే ఆనంద్‌కి నాకళంకం తెలుపుకొనకుండ ఆతనిని దగా పుచ్చలేను—

దీనిలో మోసంగాని, దగాగాని ఏముంది! నీవు మనసుతో చేయని నేరానికి నీవాభాధ్యురాలవు! అందువల్ల నీభర్తకు నీవుమోసంచేసినదానవు కానేరవు —

అమ్మా! జరిగిననేరాన్ని ఆయనకు విన్నవించుకొని, నిరపరాధినని నిరూపించుకొనీ ఆయనయిష్టతతో వివాహం చేసుకొనడంలో శాంతిఉంటుంది- అప్పుడుగాని ఆవివాహం నాకు తృప్తిగాఉండదు. నాకళంకం ఆయనముందు మధ్యవరది దాచుకొనలేను.

"పిచ్చిదానా!—నిజ విషయం అతనికి ఎరింగిస్తే మగవాడు స్వార్థబుద్ధితో క్షమించగలుగుతాడా?- నీకు ప్రపంచ అనుభవం

చాలక అలా మాట్లాడుతూన్నావు. ఆతడు ఈర్ష్యావేశంతో న్యాయాన్ని గుర్తించలేక స్వార్థబుద్ధితో నీతో వివాహం ఆతడు వదలుకొన్నాడంటే నీ స్థితి ఎట్లు మారునో యోచించుకో!- ఆతనిచేత నిరసింపబడిన నీకు మరి ఎవరితోనూ వివాహం జరుగకుండ కూడ ఆటంకానికి కారణమౌతుంది!-వంశం గౌరవం నాశనమౌతుంది. ఈ దురవార్త వింటే మీ నాన్నగారు ప్రాణమే విడుస్తాడు—"

అమ్మా!— ఆనంద్ నన్ను క్షమిస్తాడనే నమ్మకం నాకుఉంది. ఆతని క్షమాపణతోగాని నాకు శాంతి ఉండదు. జీవితమంతా ఈ రహస్యాన్ని దాచలేను. ఆతనికి ద్రోహంచేస్తూన్నానేమో అన్న బాధ నన్ను దహిస్తూంటుంది—"

అమ్మాయి!—యిట్టి సంఘటనలు మగవారికి వినిపించి కష్టములు తెచ్చిపెట్టుకొనడం మంచిదికాదు."

అమ్మా!- భర్తకు తెలియకుండ కళంకచింతతో మనసులో కాల్చుకొంటూ జీవించడంలో మాత్రం ఏ సుఖముంటుంది!-

పిచ్చిపిల్లా!- యిది విని ఆతడు నిరసిస్తె నీస్థితి ఎట్లుమారునో గ్రహించ గలుగుతున్నావా?-నీ స్థితిలోపాటు మా గౌరవంకూడ ఏ రూపం దాలుస్తుందోకూడ యోచిస్తున్నావా?-"

"అమ్మా!- ఆయన నన్ను క్షమిస్తాడు. నాకు జరిగిన అన్యాయం నానేరముగా ఎంచరు. ఆతని ఓదార్యతోగాని నాలో శాంతి ఉండదు-"

"చంద్రం- జాగ్రత్త!- వెర్రి ఊహలు పెట్టుకొని మమ్ములను అవమానముల పాలుచేయకు. ఎవరూ ఎరుగని ఈ అన్యాయ కళంకాన్ని అందరకు వినిపించి మమ్ములను అపహాస్యముల పాలుచేయకు. ఈ విషయం వింటే నీ ముసలితండ్రికి ఈనాడే గుండె పగులుతుంది-" అని తల్లి రామమ్మగారు కొంచెం మందలించే గొంతుకతో అర్థించింది-"

"అమ్మా!- జరిగిన పాపంతోపాటు, భర్తకు మోసంచేసే పాపంకూడ నన్ను కట్టుకోనమని నీ ఆదేశమా?-"

"బలవంతంగా విధి ప్రేరణతో నీయిష్టం లేకుండానే జరిగిన ఆ పాపకార్యం అపవిత్రత నీకు చెందదు. ఆ విషయం నీవు పూర్తిగా మరచిపోవాలి-"

'అమ్మా!-'

"చంద్రం!- యిహ మాట్లాడ నక్కర్లేదు. నేను నీతల్లిని, నా ఆజ్ఞను నీవు పరిపాలించాలి. నీ శ్రేయస్సుకోసం చెప్పే నామాటలను ఆమోదించడం నీ ధర్మం. మరి పది దినములలో నీ వివాహం కానున్నది. తొందరపడి అవివేకంగా అతనికి ఆ సంఘటన వినిపించావంటే నీకేకాదు. ఈ యింటికే మోసం వస్తుంది. మా మర్యాద కాపాడుటకైనా ఈ రహస్యం మరియొకరి చెవిని వేయకూడదు—" అని తల్లి చెవుతూంటే మరి మాట్లాడలేక కంట తడిని తుడుచుకొంటూ చంద్రం అక్కడ నిలువకుండ లోనికి నడచింది-

నడచిపోయే కుమార్తెవంక రామమ్మ దీక్షగా యోచనగా వోనిమిషం చూచి ఆమె వెనకనే లోనికి నడచింది.

◆ ◆ ◆ ◆

"చంద్రం!-"

"——"

కొత్తసిగ్గు కలుగుతూందా?

చంద్రం! అలామాట్లాడకుండ ఊరుకొంటే ఏమనుకోవాలి! అంత ఆనందంగా నారాకకోసం ఎదురుచూచే నీవు నాలుగు దినముల నుంచి నాకు అగుపడకుండానే తప్పించుకొని పోతున్నావ్! ఇది పెండ్లి ముందు పెండ్లికూతురు సిగ్గుకాబోలు! ఈసిగ్గుతో నాకు అగుపడకుండ పోతే నాప్రాణం ఏలాకొట్టుకొంటుందో తెలుసా? నిన్ను అనుదినం కళ్ళకుకొన అలవాటుపడిననాకు—

ఆనంద్! అవును. నీకు నేను అన్యాయమే చేశాను- కాదు—ద్రోహమే చేశాను- నీకు అగుబడలేక పోయాను.

ఏమిటీ! చంద్రిం! నీకండ్లవెంట కన్నీరా?

ఆనంద్ బాబూ! అని, యిహమాట్లాడలేక కెరటంలావచ్చే ఏడ్పును ఆపుకొనడంలో ఆమె పెదవులు వణకుతో లోనికి అణగి పోతూన్నాయి—

చంద్రిం! ఏమిజరిగింది. ఎందుకావేడ్పు? వివాహ ఏర్పాట్లు ఏమైనా తారుమారు అయినవా? మరి మూడుదినములేకదా వివాహానికి వ్యవధిఉంది!

యింతలో, అవాంతరమా?

కాదు—

వివాహానికి అడ్డుకారణంకాదుగదా?

ఊహూ-

ఎవరికైన జబ్బుచేసినదా?

కాదు ఆనంద్!

చంద్రిం! నాకువినిపించడమా? ఏమిటి?

ఆనంద్, నీవు క్షమిస్తావనే ఆశతోనే యిచ్చటకు వచ్చాను. మనవివాహానికి ముందు ఈరహస్యం ఎరిగించకుండ నిన్ను మోసము చేయలేను. నేను ఎరిగిచేయని అవచారం—

అపచారమా? నీవా? నాపట్ల అపచారం చేయడమా—? నాతపణా?

అవును- నాపట్ల క్రౌర్యం జరిగింది! ఆదురాగతమునకు నేను ఎరకావలసివచ్చింది.

చంద్రిం! నీమాటలునాకు అర్థంకావడంలేదు-

నన్ను క్షమించగలవా ఆనంద్!

ఎందుకుకాదు! నీవునాకు ఎదిరించకుండానే ఈముఖం ఎందుకు!
నీవు నాపట్ల అపచారంజరిగించలేవు. నీఅంతరాత్మనాకు బాగుగాతెలు
సుకదా! చెప్పు- నీవిచారం ఉపశమించుటకు నాప్రాణమునయినా
యివ్వగలను.

నాకు తెలుసు- నన్ను క్షమిస్తావని, మనఃపూర్వకముగా నన్ను
ఆదరించి అనుగ్రహం చూపడమే నాకు కావలసినది.

చంద్రా! నావంకకు తిరిగి నీవిచారానికి కారణం వినిపించు-
ప్రాణమైన యివ్వ వెనుదీయని నీఆనంద్ నీవిచారం ఉపశయింపచేయు
టకు క్షమాపణయే యివ్వలేక పోతారనే విచారపడుతూన్నావా!

ఆనంద్! ఈఅన్యాయం మనసులో యిముడ్చుకోనలేక ఈ
నాడుబలవంతంగా హృదయప్రేరణతో ఈవలకు వచ్చాను.

చంద్రా! ఈనాడుచాల బేలగా మాటాడుతూన్నావు. నీలోని
పెంకితనం చలాకీ ఈవిధంగా మార్చగలిగిన ఆవిచారవిషయం ఏమిటా
అని నామనసుకూడ వేగిరపడుతోంది. వినిపించు చంద్రా! మాట
యిస్తూన్నాను- భయపడకు. పెంకితనపు మాటలలోచూచే నీముహం
ఈనాడు ఈవిషాదంలో చూడలేక పోతూన్నాను.

ఆనంద్! ఆమాటలు నానోటితోవిని పించలేను- ఇదిగో—
ఈకాగితంలో వ్రాసితెంచాను. ఇది అందచేయడానికే నిదగ్గరకు
వచ్చాను- అని విచారంతో గొంతుకలోనుంచి ఉబుకుతూన్న దుఃఖా
న్ని ఆపుకొంటూ ఆఉత్తరం ఒణకే చేతితో ఆతనికి అందించి తలను
ప్రక్కగా త్రిప్పి, వంచుకొంది...

ఆఉత్తరములోని విషయములు ఆతని ముహంలో భీకరరూ
పాన్ని తీసుకొని రాగలిగాయి.

ఆతనిలో తుఫాను రేగినట్లు సూచనలు ఆ కనుబొమల ముడి
తోనూ, ఎర్రపడ్డ కండ్లలోనూ, పెదవుల ఒణుకు ఆవేశంలోనూ అగు
పిస్తూండడం చంద్రించూచి దిగులుగా తలవంచుకొంది.

ఉత్తరం చదవడం పూర్తిచేసుకొని, ఆకాగితం రెండుచేతుల తోనూ చింపి నులుమివేస్తూ తలఎత్తి ఆమెవంక చూచాడు.

చంద్రం! మంచిది! యిప్పుడు నీవు ఏమిచెప్పుకొన వచ్చావు.

నిజం ఎరిగించి క్షమాపణ వేడుకొని, అంగీకరించి అనుగ్రహించమని వేడుకొనవచ్చాను.

చంద్రా! ఆనంద్ పరువు, పౌరుషంలేని చవటివ్యక్తి యని ఊహించి అడుగవచ్చావా? జరిగింది! జరిగినది ఆనంద్ హృదయంమీద సమ్మెట పెట్టు—

ఆనంద్; అనుగ్రహించ లేవా?

ఒకడు కక్కిన ఎంగిలికూడుకొరకు ఆశించే నీఛజీవినికాదు నేను. నాకూపౌరుషముంది. వాడు ధనికుడైనంతమాత్రములో ఎంగిలిచేసి విడచిన వస్తువును ఆదరించవలసిన అవసరం నాకు ఏమిఉంటుంది! అతని అధికారములో లొంగి నృనతపడవలసిన నిమిత్తం నాకులేదు.

ఆనంద్! అతనికార్యదోషం అనుభవించవలసినది నేనా; న్యాయాన్ని గుర్తించలేవా? అంటూ మాటలు ప్రకటింపలేని బాధను ఏడ్పులో ఆతనిముందు ప్రకటించుకొంది.

చంద్రా! ఇందునీవు ఎరిగిచేసిన దోషంలేదని నేను ఎరుగుదును. నామనస్సుఏలనో నిన్ను అంగీకరించలేకపోతోంది. పొరపాటున విషం కలుపబడిన పదార్థమును మనము తెలిసి భుజించగలమా?

ఆనంద్! యిప్పుడు నేను ఏమిచేయ్యాలి! ఎక్కడకుపోవాలి... అంటూ ఆమె విచారంతో గొంతుకలోనుంచి ఉబుకుతూన్న దుఃఖాన్ని అవుకొంటూ మాటాడుతూంటే,

చంద్రా! ఏమిచేయను. నన్ను చిత్రవధచేసినా నాప్రాణి యింతబాధపడేది కాదేమో! నీకు వశమైన నాశక్తులన్నీ ఈనిముషం లో తిరుగుబాటు చేస్తూన్నాయి. ఈవిషాదభయంకర విషయం నా రక్తంను వేడిపర్చి ప్రతీకారంకోసం పరుగులెత్తిస్తూంది. ఒకరిచేత ఎం

గిలిపర్చి విడచిన వస్తువెంత గొప్పదైనా ఆశించి, స్వీకరించడం ఉత్త మవంశీయుల లక్షణంకాదు. చంద్రా! నిన్ను వివాహం చేసుకొన లేనని చెప్తున్నందుకు క్షమించవేడుచున్నాను. అని ఆనంద్ ఆమె వంక చూడకుండానే చెప్పుమాటలకు ఆమెకండ్లు క్రోధరూపాన్ని దాల్చినాయి.

స్వార్థపరుడా! అర్థమైంది నీప్రేమ. మాధవప్రవర్తులుగలమూష జీవివని తెలుసుకొనలేకపోయాను. విశాలహృదయంగల మానసివనీ దురభిప్రాయపడి నన్ను నేనే మోసం చేసుకొన్నాను: మంచిది,నీఅను గ్రహంగాని, క్షమాభిగాని యిహనాకు అక్కరనేలేదు- వెడుతూ వున్నాను...

చంద్రా, ఆతనిచే చెరుపబడిన నీవు ఆతనినే వివాహం చేసు కొనడం మంచిదని-

ఆగు! సిసలహాలను అడుగుటకు నేను యిచ్చుటకు వచ్చియుండ లేదు_నాతలిదండ్రుల వంశగౌరవం కాపాడువిషయుప్రశ్న యిప్పుడు నాముందు నిలచిఉంది. దానికొనమో యోచింపవలసిఉంది. అదే యోచిస్తూన్నాను. సరే_ ఆవిషయం నేను చూచుకొంటాను. సెలవు. వెడుతూన్నాను.

అభిమానానికి బదులు అన్యాయ- అనురాగానికి బదులు ద్వే షం- సహకారానికి బదులు ప్రతికారం- పరమార్థానికి బదులు స్వా ర్థము ఆతనిలో విశ్వరూపం దాలుస్తూంటే ఆనంద్ ఆమెను న్యాయ దృష్టితోచూచి అనుగ్రహించలేకపోయాడు.

పురుషుల సహజస్వార్థం ఆతనిని ఆవేశించి ఆమెను తృణీకరింప చేసింది——

ఆమెను తృణీకరించిన ఆతనమనస్సు ఆమె నిష్క్రమణంతో వేదించి పీడించినట్టయింది.

చంద్రం తన తిరస్కారముతో ఏమియుపద్రమునకు లోనవుతుందో అనే సింపతీ- ఆతని హృదయంలో ఒకమూలనుంచి తలఎత్తుతూంటే ఆనంద్ అక్కడ నిలువలేక వెనుతిరిగి నడచిపోయాడు.

6

వీరన్నా! చంద్రం పెండ్లి ఆగిందంట కదూ!

ఆ! ఆఆనంద్‌గాడు పట్నం పారిపోయినాడట. అందుచేత పెండ్లి ఆగిపోయింది.

పోవడాని కారణం?

అదే తెలియకుండా ఉందండి ప్రభూ!

అదంటే వాడికి అపరిమిత అనురాగంఅటకదూ!

అట్టిపరిస్థితిలో వివాహానికి ముందు అదృష్టాన్ని కాళ్ళ దన్నుకొని అగుపడకుండ పోవడంఏమిటి.

శని ఆవేశించినప్పుడు అదృష్టదేవత పిశాచిలాగే అగుపడవచ్చును కదా!

ఇది ఏదో విచిత్రంగానే ఉంద.

లేకపోతే_ చంద్రం మీావల్లచేసిన సంగతివాడికి అందియుండలేదుకదా.

ఛా! ఆపని జరిగియుండదు. దానివివాహానికి అడ్డుపడి జీవితం నాశనం చేయడం మనకు అక్కరమాలిన పని. మనవాంఛ తీర్చుకొని పంపివేయడంవరకే మనపని...

తమరువాడికి తెలియబరిపించారని నాఉద్దేశంకాదండి దొరా!

మరి! ఈరహస్యం మనముగ్గురిలో తప్ప మరిఎవరికి తెలియదు కదా! నీలకంఠంనకు ఈఊరివారు తెలియనే తెలియరుకదా!— నీవుచెప్పవు. నావల్ల తెలువపడలేదు. చంద్రం తానే సిగ్గువిడచి చెప్పుకొనలేదు. మరియొకలా వాడికితెలియడానికి మార్గం ఎక్కడిది.

కోరి వివాహం చేసుకొనేపిల్ల దొరకినప్పుడు ముహూర్తం ముందు యిల్లువిడచి పోవడం అందరికి ఆశ్చర్యంగనే ఉంది.

"అది మళ్ళీ ఎవరిచేతిలో పడనున్నదో!- దానిని కట్టుకొని అనుభవించేఅదృష్టం ఎవరికి వ్రాసియుంచాడో భగవంతుడు!-'

"చిత్రం. నీలకంఠంగారు బలే తమాషాగా నాటకం ఆడారండి. మీచేతి పిస్తోలుదెబ్బ తిన్నట్టు అంత నేర్పుగా ఆయన నటించకపోతే అది మీ గుట్టుం ఎక్కడికాదండి. చాల ఆగతాయిరకం పెంకిపిల్లండి చంద్రం. అది మీగుఱ్ఱంమీద మీతోవచ్చి వేసిందంటే అసలు నేను నమ్మలేకపోయాను-'

ఆగతాయిరకం పెంకిపిల్లండి చంద్రం. అది మీ గుఱ్ఱంమీద మీతో వచ్చివేసిందంటే అసలు నేను నమ్మలేకపోయాను-"

"యుక్తితో ఎంత పెంకిదాసినైనా కట్టివేసి అనుభవించగల శక్తి మనలో ఉంది-"

"బంగళాలో అల్లరిచేయకుండా ఊరుకొందాండి!-'

'దాని అల్లరి యిక్కడ ఎవరు వింటారోయ్!- తప్పించుకొన ఎన్నివిధాల ప్రయత్నించాలో ప్రయిత్నించింది. ఎంత బ్రతిమాలినా లొంగకుండ, నేను చూపిన ఆశలను లెక్కచేయకుండ చాలా శ్రమపెట్టింది. చివరకు బలవంతం చేసి సింహములా లంఘించి నా కామం తీర్చుకొన్నాను- ఆనుఖంలో చేయునదిలేక మూర్ఛిల్లినట్లు కండ్లుమూసుకొని కదలకుండ నేలమీద పడిపోయింది. ఆమె మూసిన

పెద్దకండ్ల అందాన్ని చూస్తూ ఆమె సౌందర్యమును తనివితీర అనుభవించాను. తృప్తితీర అఘ్రాణించి వశపరచుకొన్నాను-'

ఆమె పెండ్లి ఆగిపోవడంతో ఆమెతండ్రి రంగాప్రసాద్‌గారు జెంగతో మంచం ఎక్కారు. అతనికి సేవచేయడంలో చంద్రం అసలు ఈవలకు రావడమే లేదు.

జబ్బుచేసిందా!- ఆ ముసలివానికి ఆ స్థితిలో జబ్బా!-

అవును. అందుచేతనే యిహ అతడు బ్రతుకుతాడనే ఆశలేదని చెప్పుకొంటూన్నారు మా ఊరివారు.

అరే!_అయితే చంద్రం చాల ఆపదలో చిక్కుఉందన్నమాట

అవును. ఆ మొగదిక్కు ఒక్కడూపోతే వారిగతి ఏమిగావాలనే సంతాపం వారిని-

వీరన్నా!- ఈ స్థితిలో ఆ ముసలి రంగారావుకి మనం వైద్యం చేయించి బాగుపరపించ ప్రయత్నం చేశామంటే చంద్రం మనకు సానుభూతిచూపుతూ మచ్చికపడదంటావా?-

వద్దు బాబూ!- నాకు తెలుసు. రంగాగారి భార్య రామమ్మగారుకూడ చాల పట్టుదల అయిన మనిషి. తనకు జరిగిన చెరనుగూర్చి చంద్రం తల్లిదండ్రులకు చెప్పియే యుంటుంది. అది పరాభవంగా ఎంచి మనలను దూషించక విడువరు_

వీరన్నా!- మరి ఉపాయం లేదా!-

ఒకటేమార్గం-

ఏమది?—

నారయ్యశ్రేష్ఠి లేడూ!- అతడే ఆయింటి వైద్యుడు. అతని ద్వారా కొంతపని జరిగించుకొనవచ్చును-

అది ఏలా సాధ్యపడుతుంది!-

శ్రేష్ఠి డబ్బుఅంటే ఆశపడుడుకదా?- అతనికి డబ్బు ఆశచూపితే ఏపనిఅయినా చేస్తాడు.

ఆతనివల్ల మనకు ఏమికాగలదు?

చంద్రిం ఆశ్రేష్ఠియింటికి తండ్రిమందుకొరకు వస్తూంటుంది-"

శ్రేష్ఠి యిల్లు ఊరుచివర కొబ్బరితోటలో కదూ!

అవును.

పూర్వంవలె చీకటివేళలో రాదుకదా!

ఊహూ! బలవంతంచేసి అక్కడనుంచి తీసుకొనిరా ప్రియత్నం చేసిన ఎడల ఊరువాగంతా మీాదపడకమానరు. చాల ఉపద్రవము జరుగుతుంది——

మరినీవు చెప్పు ఉపాయం?

వినండి- శ్రేష్ఠి మీామాటకు అడ్డుచెప్పడుకదా!

డబ్బు ముందుగా పారివేస్తే శ్రేష్ఠి ఎంతటిపనికైనా సిద్ధం. తని సంగతినాకు పూర్తిగా తెలుసు——

రంగాగారి యింటికి శ్రేష్ఠివెళ్ళి జబ్బుమనిషిని పరీక్షించి యింటిదగ్గరమందు యిస్తానని చెప్పి చంద్రింను వెంటపెట్టుకొని తనయింటికి తీసుకొని రావాలి.

ఆతరువాత——

నారింజరసం మర్యాదకోసం యిచ్చినట్లు చంద్రించేత ఆయన త్రాగించాలి.

దానివల్ల ప్రియోజనం?

ఆనారింజరసంలో మీాదగ్గరఉన్నదని సీతో చెప్పిన మత్తుమందు అందులోకలిపింది త్రాగించాలి.

స్మృహతప్పిన తరువాత ఆమెను శ్రేష్ఠి మనకు వప్పగించాలని సీఉాహ కదూ!

అవును- అలాగే జరిగించాలి. స్మృహవచ్చిన తరువాత మన

బంగాళాలోనే బంధింపబడుతుంది. ఈమారు దానితో చనువుచేసుకొనుటకుకూడ అవకాశం ఏర్పడుతుంది.

ఏదోలా మరియొకమారు చంద్రం నాకు అందడమే కావాలి- శ్రీప్తిని నామాటగా యిక్కడకు పిలుచుకొనిరా? ఈరకం స్త్రీలను వశపరచుకొనుటకు భద్రపరచిన మత్తుపదార్థం తంత్రంగా ఆరింజి రసంలో కలిపించి ఆమెచేత త్రాగించవలసిన బాధ్యత ఆతనిమీదనే ఉంచుతాను—

ఆదెబ్బతో చంద్రం తిరిగిమనకు చిక్కినదన్నమాటేగా—

మంచిఉపాయమే చెప్పావు వీరన్నా! ఇదిగో ఈయిరువదిరూపాయలు నీకు అదనపు బహుమానం.

— ఎంత తెలివి తక్కువగా ప్రవర్తించి యిక్కడకు వచ్చావురా!

కర్తవ్యతా మూఢున్నాయి. వివేకశూన్యుండనై యోచనశక్తి లేక, న్యాయాన్ని చూడలేక అప్పటిఉద్రేకంతో ఆమెను తృణీకరించి తోసిబుచ్చాను.

పిచ్చివాడా! ఆమె తనకు జరిగిన అన్యాయంగూర్చి నీముందు మథ్యపరచలేక, ద్రోహ చింతను భరించలేక వివాహానికి ముందు విశాలహృదయంతో నీతో చెప్పుకొనవచ్చిన ప్రేమికురాలికి యిదా నీవుచూపవలసిన సానుభూతి! ఆమె ఎరిగిఉండి చేసిన అన్యాయంగాని అక్రమంగాని ఏమిఅగుపించిందనితృణీకరించి ఆమెను చిన్నబుచ్చావ్. ఆనంద్! ఆమెకు అక్రమంచేసి పంపివేయగలిగావ్. పశ్చాత్తాప బుద్ధితో నీతో—

అచ్యుతం! నాజ్ఞానేంద్రియాన్ని తెరిపించి న్యాయాన్నిచూపావు. నిజం! నాచంద్రం నన్ను మనఃపూర్తిగా ప్రేమించి నాతో వివాహం కోసమే అనేకసంబంధాలను తోసిబుచ్చింది. నేను పట్నంలో చదువు సంధ్యలులేనివాడినై చెడిపోయానని విన్నప్పుడుకూడ,

నన్ను క్షమించి నాతో వివాహంకోసం తన తలిదండ్రులతో వాదించి కోరుకొంది. నా ఆనందంకోసమే నన్ను అనుదినం రహస్యంగా కలుసుకొని లాలించేది. అట్టి నా అదృష్ట దేవతను తూలనాడి త్రోసిబుచ్చాను.

ఆనంద్! ఇప్పటికైన మించిపోయినది ఏముంది! తిరిగి నీగ్రామం యిప్పుడే చేరుకో! ఆమెను కలుసుకొని నీ తిరస్కారణకు క్షమాపణ వేడుకో! ఆమెను వివాహం చేసుకొనుటకే ప్రయత్నించు—

అచ్యుత్! ఏముఖంతో తిరిగి మాగ్రామం చేరుకోగలను నేను! వివాహం ఆపి ఆకుటుంబమునకు తీరని సంతాపం కలుగచేశాను. నాయందు ప్రేమచూపి నన్నే వివాహమాడ నెంచిన నాచంద్రికకు అపకారంచేసి మరల ఆమెను ఏలా చూడగలను-

ఫరవాలేదు. ఆనంద్! ధైర్యం వహించు! లే. వెళ్లు. ధీరబుద్ధితో ఆమెనే వివాహంచేసుకో! ఈ కట్నంటే ధనమదాంధకతతో చెలరేగే అవినీతి పనులను అణచటానికి ప్రతిజ్ఞ చెయ్యి! ఆజామీందారుమీదనే ప్రతీకారదీక్షను పూని బుద్ధిచెప్పు! లే! మనస్సు దిట్ట పరచుకో! చంద్రిక నిన్ను క్షమిస్తుంది. నిన్ను తిరిగి వివాహమాడుటకు సంతసపడుతుంది.

నిజమా? అత్తగౌరవం ఎరిగిన చంద్రిక నాతిరస్కారణకు కోపించకుండ క్షమించగలదా? ఆనంద్‌ను పూర్వంవలె ప్రేమిస్తుందా!

“స్త్రీప్రేమను నీవు ఎరుగవు. ఆమె నిన్ను క్షమించి స్వీకరిస్తుంది. మగవారిస్వార్థం స్త్రీప్రేమకు మసింటకలిగించుకొని మనస్సును నీచపరచుకొనదు. అట్టిప్రేమకునికి ప్రాణమయిన యిస్తుంది. త్వరపడు- వెళ్ళు”

“అచ్యుత్! నాకిష్టమైన తెలిపినావు నాఅజ్ఞానమును పారదోలినావు నమస్కృతులు. ఇప్పుడే వస్తాను. ఆమె కాళ్ళమీద పడి క్షమా

వణకోరుకొని వివాహమాడతాను. అని ఆనంద్ అంటూంటే ఆతని మిత్రుడు ఆతనికి కోటును తొడగి తొందరగా ఆపల్లిగ్రామం పంపి వేశాడు.

7

'ఓ! ఆనందా?...ఎప్పుడు తిరిగినీరాక!—'

"ఈదినం సాయంకాలమే-"

"యింటివద్ద అగుపడ్డావా?"

"ఆ! రంగాగారిని చూచి పోవడానికి వారియింటికి కూడా వెళ్లాను."

"రంగాగారి యింటికా?...అవును. పాపం ఆయనకు యిప్పుడు ఏలాఉంది!—"

"జబ్బుస్థితిలో కదలలేకుండానే ఉన్నారు. చూడు వీరన్నా!—సాయంత్రం నాలుగుగంటలకు ముందుగు వెళ్లిన చంద్రిం యింకవరకు యింటికి రాలేదని ఆమెతల్లి రామమ్మగారు కంగారుపడుతున్నారు."

"ఐతే శాస్త్రిగారి యింటికేమీపోక!-'

"అవును. ఆమెను కలుసుకొని తీసుకొనిరావడానికే"

"వెర్రిమారాజులు!— అందుచేతనే అది మిమ్ములను అలా ఆడించే పేరుకోసం మిమ్ములను భర్తగాపొందప్రియత్నిస్తూంది"

"వీరన్నా!—ఏమిటి నీమాటలు!-"

అబద్ధంచెప్పడానికి నాకేం కావాలిబాబూ!- మొదటినుంచి సాతకాలాయేగా!"

'వీరన్నా!—నాకు ఏవో మోసపుమాటలను వినిపిస్తున్నావు"

"లేదండి—ఇప్పుడు వెళ్ళి జమీందారుగారి పడకగదిలోకి రహస్యంగా అద్దాలతలుపులలోనుంచి పొంచిచూడబట్టి అక్కడ ఆచంద్రిం ఆయనతో మధురమయ దేవత్వసుఖాన్ని అనుభవిస్తుంటుంది అప్పుడే మీకు అర్థమాతుంది."

"పద- నాకండ్లతో స్వయంగాచూచువరకు విశ్వసించలేను.' అని ఆనంద్ అంటూంటే వీరన్న విషపునవ్వుతో ఆతనిని వెంటనిడుకొని జమీందారుగారు బంగాళావంకకు బయలుదేరాడు.

వీరన్న ఆనందకు దారిచూపుతూ అవంకకు తీసుకొనిపోయాడు.

వీరన్న ఆగది అద్దములకిటికి ప్రక్కకు చేరి ఆగాడు.

ఆనంద్ ఆతనిని అనుసరించాడు.

చంద్రిం మొహమల్ పరుపుమీద పడుకొనిఉంది—

జమీందారు ఆమెప్రక్కనేకూర్చుని ఆమెముహంమీద మూగుతూన్న ముంగురులను సరిచేస్తూ ఆమెశరీరాన్ని స్పృశిస్తున్నాడు.

"ఆనంద్ బాబూ!— చూడండి! చంద్రిం ఆతపగదిలో ఎంత స్వేచ్ఛగా సదిస్తుందో!- ఆమెను తనదానిగా చేసుకున్న జమీందారు ఆమెప్రక్కనే శరీరాన్ని తాకుతూ—" అని వీరన్న చెవుతూండగనే ఆనంద కండ్లు లోపలదృశ్యాన్ని చూచాయి-

ఇహ ఆగలేక పరుగునవెళ్లి బంధింపబడిని అద్దముల పెద్దతలుపును 'పెడి"లున తన్నేడు

అద్దములు పగిలి పెద్దచప్పుడుతో తలుపువిడిపోయింది.

వీరన్న ఒక్కపరుగుతో అక్కడనుంచి మాయమయ్యాడు-

"రాక్షసీ!— ఛీ!- నన్ను మాయచేయతలపడిన వ్యభిచారిణివని యిప్పుడు స్వయంగా తెలుసుకొన్నాను.' అని ఆనంద్ ఆకలిగొన్న

సింహములా అరవడంతోనే పక్కమీదపరున్న చంద్రం కండ్లు తెరిచి-

"ఎవరూ?- నాఆనందా?— నేనుఎక్కడఉన్నాను? ఆనంద్!- ఆనంద్—' — అని చంద్రం ఆశతో నిద్రనుంచి మేల్కొంచినట్లు లేచి నిలువబడింది.

"ఎవడవు నీవు, నాబంగాళాలో కాలుపెట్టి ఏధైర్యంతో వచ్చావ్—"

"మోసబుద్ధి,— మీయిరుపురిప్రాణాలు తీయడానికె కాలుడనై నీగదికివచ్చాను-'

"మంచిది జాగ్రత్త— అడుగుకదలితివా. నాపిస్టలుకు ఎరకా గలవు." అంటూ పరుపుక్రిందిపిస్టలును తీసి ఆనందువంకకు గురిపెట్టాడు జమీందారు.

పిస్టలు అతనిచేతినుంచి జారి చంద్రం కాలుముందుపడింది-

ఆనందును విసరువచ్చి జమీందారుగారు ఆపిస్టలు అందుకోనడానికి పరుగెత్తుకొనిరా చూడగా చంద్రం ఆపిస్టలును తొందరగా అందుకొని ఆనందుదగ్గరకు విసరింది. ఆనంద్ ఆపిస్టలును అందుకొని జమీందారుకి గురిపెట్టి ఢాం మనిపించాడు.

తోడనే జమీందారు విశ్వాసరావు హాహాకారాలతో విలవిల తన్నుకొంటూ నేలగూలాడు.

—

8

జమీందారుని తానే స్వయంగాచంపినట్లు అంగీకరించి వాంగ్మూలం యివ్వడంచేత హత్యానేరం చంద్రంమీద పడింది.

ఆనంద్! ఈమన వీడ్కోలులో ఈవిధంగా ఏడ్చి నన్ను ఆవేద పరచకు. నాకు ఏచింతా లేదు. నన్ను మరచిపో—!

జమీందారుబంధువులు, లేనిసాక్ష్యములనుకూడ దీసి కేసు బలపరచడంచేత మానసంరక్షణకొరకు చంపాననీ చంద్రిం వాదించిన వాదనలకు సాక్ష్యంలేక కోర్టువారు ఆమోదించలేదు_

నేరం చంద్రింమీద బలపడింది.

న్యాయస్థానం ఖూనీనేరమునకు ఆమెకు ఆదినమే ఉరిశిక్షను విధించినట్లు తీర్పుయిచ్చారు-

మరి నాలుగుదినములలో చంద్రిం ఉరితీయబడుతుంది_

జయలర్ పర్మిషన్‌తో ఆనంద్ ఆమెను కలుసుకొని చెరశాల యినుపకటకటాల దగ్గరకు నెమ్మదిగావచ్చి గద్గదికతో నోటమాట రాక ఆగాడు—

వార్డెన్ చంద్రింను, ఆతడు నిలచిన స్థలమునకు సమీపం లోనికి తీసుకొని వచ్చాడు—

ఎవరూ! ఆనంద్‌గారా!

అవును. ఆపాపినే నేను! నేనుచేసిన నేరం నీనెత్తినివేసి శాంతిగా భూమిమీద నిలువచూచే కర్కసహృదయుడను నేనే—

ఆనంద్! విచారించకు. నాప్రాణములుకూడ నాప్రేమికుని రక్షణకొరకు బలిగా యివ్వగలిగిన అదృష్టానికి నేను సంతసపడుతూన్నాను. ఈచావువల్ల నాకుపరముంది. ఆనంద్! విచారించకు. నన్ను శాంతివచనములతో యిప్పట్లో పంపాలి. నాఆత్మను ఎవరు చంపగలరు. అది నీప్రేమపరిచయంకోసం, నీసేవకోసం నీఛాయలలోనే తిరుగుతూంటుంది. విచారించకు.

నిజం! యిప్పుడు గ్రహించాను. ఇదంతా వీరన్న శ్రేష్టులు చేసిన మోసము.

చంద్రా!—

ఆనంద్! ఒక్కమాట. ఇప్పుడే నా ముసలి తల్లిదండ్రులు నన్ను చూచి పట్టలేని దుఃఖంతో యింటికి వెళ్ళారు. వారిని ఓదార్చి ధైర్యంచెప్పి వారిని ఓకంట చూడవలసినదిగా నా ప్రార్థన—

చంద్రా! నా జీవితమంతా వారికి సేవచేస్తాను—

'నా అపచారములు మన్నించు ఆనంద్!- నిర్దోషిని, అని కంఠం తడితో దుఃఖాన్ని ఆపుకోనలేక దగ్గుస్వరంతో చంద్రం అంటూండ గనే ఆనందు మాట ఆమెకు అందకుండానే అప్పటికే చాలా టయిము అయిందని యమకింకరునిలా ఆజయిలు వార్డెను ఆమెను లోనికి తీసుకొని పోయాడు—

ఆనందు పగిలిన హృదయంతో అక్కడనే కూలబడి పోయాడు-

సంపూర్ణం

సూచన

మాయచేయబడి బలవంతంగా చెరుపబడిన స్త్రీ కళంకిత అగునా?

మాలినపడని హృదయంగల స్త్రీ నిష్కళంకిత కాదా?

పశుకామబుద్ధితో ఇతరులని చెరపబడిన స్త్రీ ఎరిగిచేయని నేరానికి సంఘం సానుభూతిచూపి ఆదరిస్తుందా?— అనే ప్రశ్నలజవాబే ఈ కథయొక్క సారాంశం-

ఇట్లు

మీ మానాపురం

హెచ్చరిక

సుప్రసిద్ధ నటీనటులగు సి. యస్. ఆర్; గండి
కోట; రేలంగి; మిస్ సుభద్రలేగాక కవితా
కళానిధి శ్రీయుత బలిజేపల్లి; కొచ్చెర్ల
కోట; పులిపాటి సోదరులు; శ్రీమతి
పూర్ణిమ; శ్రీమతి కళ్యాణి మొద
లగు ప్రఖ్యాత స్క్రీను తారా
గణంతో నటింపబడి సినీ క్రిటిక్ ల
ఆదరణతోపాటు వివిధ పత్రికా ప్రశంస
లను అందుకొన్న ఆధునిక సమస్యలను
సంస్కరించే సాంఘిక స్టేజి నాటకము—

రేవతి

రెండవముద్రణలో ఉంది. నేడే కాపీలకొరకు
త్వరపడండి

వలయువారు :—

కాతు బుక్కుడిపో,

పబ్లిషర్సు రాజమండ్రి.